1986 సెప్టెంబరు 15వతేదీ ఓనం సందర్భముగా పూర్ణచంద్రలో భగవాన్‌బాబావారి దివ్యోపన్యాసం

# 'ఓణం' పర్వదినముయొక్క అంతరార్థము, విశిష్టత

**స్వర్గమన్న పరలోకమున లేదు**
**నరుల లోకమందె అమరియుండు**
**సద్గుణంబులు కల్గి సరియైన నడతున్న**
**అదియె స్వర్గమగును అవనియందు**

ప్రేమస్వరూపులారా!

భారతీయ సంస్కృతికి వేద, ఉపనిషత్తులే మూలము. సంగీతమునకు, సాహిత్యమునకు వేదములే మూలకారణము. సామవేదమునుండియే సంగీతము ఆవిర్భవించింది. ఋగ్వేదమునుండి యేర్పడినదే సాహిత్యము. భక్తి పూరితమైన సంగీతమే భగవంతునియొక్క స్వరూపము. కనుకనే

**నాహం వసామి వైకుంఠే న యోగీ హృదయం**
**మద్భక్తాః యత్రగాయన్తి తత్ర తిష్ఠామి నారద**

అన్నాడు నారాయణుడు. నేను వైకుంఠమునందుగానీ లేక ఏ యోగుల హృదయమునందుగానీ నివసించుటలేదు. 'మద్భక్తాః యత్రగాయన్తి'. 'ఎక్కడ నా భక్తులు నన్ను స్మరించుచుందురో అక్కడ నేను ప్రతిష్ఠయై వుంటాను', అన్నాడు. భగవంతుడు భక్తుల హృదయమునందు మాత్రమే కాక దుష్టుల హృదయమునందుకూడను తాను వుంటున్నాడు. తాను తరించి పరులను తరింపచేయగోరునట్టి మానవుడే నిజమైన మానవుడని నిరూపించింది వేదము. సర్వాంతర్యామియైన భగవంతుడు సర్వుల

srisathyasaivachanamrutam

హృదయస్థాయియై, సర్వమానవత్వాన్ని రంజింపజేయుచు దివ్యత్వమును ప్రకటింపచేస్తూవుంటాడు.

**భగవంతుడు సర్వజీవులయందు ఉంటున్నాడు**

ప్రహ్లాదుడు ఒకానొక సమయమున తన తల్లియైన లీలావతి దగ్గరకు వచ్చి "అమ్మా! హరి ప్రియుడనైన నాకును, హరిద్వేషియైన నా తండ్రికిని వున్నది ఒక్కటే భేదము. నేను భగవంతుని ప్రేమిస్తూ, స్మరిస్తూ ఆయన ప్రేమ రసామృతమును గ్రోలి నా హృదయమును నింపుకొని మత్తుడనై, ప్రేమోన్మత్తుడనై. తన్మయత్వుడనై, తాదాత్మ్యభావనలో ఆనందాన్ని అనుభవిస్తున్నాను. నా తండ్రియైన హిరణ్యకశిపుడు నారాయణుని ద్వేషించి తన హృదయమును కఠినమైన శిలగా మార్చుకొని ఆ శిలయందే నారాయణుని ప్రతిష్ఠ చేసుకున్నాడు" అన్నాడు. హరిని ద్వేషించిన హిరణ్యకశిపుని హృదయమునందును, హరిని ప్రేమించిన ప్రహ్లాదుని హృదయమందును వున్నది ఒక్కడే హరి. ద్రవరూపమైన ప్రేమను ఆరగించి దాహమును తీర్చుకొని తనయొక్క తాపమును చల్లార్చుకున్నాడు, ప్రహ్లాదుడు. కఠినమైన హృదయమునందు హరిని ప్రతిష్ఠచేసుకొని తన తాపమును చల్లార్చుకొనలేక, దాహమును తీర్చుకొనలేక అనేక విధములైన అవస్థలకు గురయ్యాడు, హిరణ్యకశిపుడు. 'నమ్మి, బ్రతుకు!' అన్నారు. నమ్మిక గలిగిన మానవునికే ఆనందము లభ్యమవుతుంది. ఆనందమును పొందిన మానవుడు అశాంతికి దూరమవుతాడు. అశాంతి దూరమైనప్పుడు శాంతి, సుఖములు అనుభవిస్తాడు. 'దైవము సర్వవ్యాపి' అనే సత్యాన్ని గుర్తించుకున్న పరమభక్తులు దైవత్వాన్ని స్మరించి, విశ్వసించి తమ జీవితము సార్థకము గావించుకుంటారు. దైవములేని స్థానము లేదు. దైవము కాని నామములేదు. భాగవతమునందు ప్రహ్లాదుడు చెప్పాడు:

**ఇందుగలడందు లేదని**
**సందేహము వలదు చక్రి సర్వోపగతుం**
**డెందెందు వెదకి చూచిన**
**నందందే గలడు దానవాగ్రణి వింటే!**

త్యాగరాజుకూడా చెప్పాడు. 'ఏతావునరా నిలకడ నీకు' అని. 'ఎక్కడ చూచినా నీవు వుంటున్నావు. నీకు నిలకడయే లేదు. సర్వవ్యాపకుడవు. సర్వాంతర్యామివి, సర్వజ్ఞుడవు, సర్వశక్తిమయుడవు', అని వర్ణిస్తూ వచ్చాడు. కేవలము మానవులయందు మాత్రమే కాక, పశుపక్షిమృగాదులయందుకూడను దైవము ఆవరించివున్నాడు. ఈ సత్యమును గుర్తించిన త్యాగరాజు

**రామచిలుక నొకటి పెంచి ప్రేమ మాటలాడనేర్పి**
**రామ రామ రామా యనుచు రమణి ఒకతె**
**ఎన్నగా శ్రీరామ భజన కన్న మిక్కిలున్నదా**

అని కీర్తించాడు. దైవత్వమనేది సకల భూతలమందుకూడను వుంటుండడంచేతనే అపరంజి రామచిలుకను పెంచి 'రామ, రామ' అని ప్రేమమాటలు నేర్పినప్పుడు ఆ రామచిలుకకూడను రామరామ అని స్మరించినట్లుగా త్యాగరాజు వర్ణిస్తూ వచ్చాడు.

**భగవంతుడు, భక్తుడు అవినాభావ సంబంధము, అన్యోన్యాశ్రయము కలిగినవారు**

'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి'. బ్రహ్మతత్త్వమును గుర్తించినవాడు తానే బ్రహ్మ అవుతాడు. వాల్మీకి నిరంతరము రాముని స్మరించుచూ, చింతించుచూ రామాయణము లిఖిస్తూ వచ్చాడు. కనుకనే వాల్మీకియొక్క ముఖతేజస్సునందు రామ దర్శనము చేసుకుంటూ వచ్చారు, ఆశ్రమవాసులు. మనస్సున యెట్టి పవిత్రమును చింతించునో ముఖమున దానిని ప్రకటితము కావిస్తూ వుంటాది, అంతర్‌శక్తి. Reflection of the inner being. రామచింతనచేత రమింప చేసుకున్న దివ్యతేజస్సుతో కూడినవాడు వాల్మీకి. మోజస్ నిరంతరము భగవంతుని చింతించటంచేత తనయొక్క ముఖము దైవకళతో, దైవ తేజస్సుతో ప్రకాశిస్తూ వచ్చింది. ఇది బైబిల్‌లో ప్రకటితమైన విషయము. డార్విన్ అనే వ్యక్తి తాను విద్యార్థిగా వుండిన సమయములో Henslow అనే గురువు దగ్గర తాను విద్యనభ్యసించాడు. ఆ అధ్యాపకుడు పరమ పవిత్ర హృదయుడు, నిస్వార్థప్రియుడు, నిరహంకారి మరియు నిశ్చలచిత్తుడు. అట్టి గురువును ఆశ్రయించిన డార్విన్ నిరంతరము గురువువలే అట్టి స్థితిని అనుభవించాలి అని చింతన చేస్తూ వచ్చాడు. 'యద్భావం తద్భవతి'.

srisathyasaivachanamrutam

మానవునియొక్క భావములను పురస్కరించుకొనియే ఫలితములుకూడను వుంటాయి. కట్టకడపటికి తన చిరకాలవాంఛను తీర్చుకోగలిగాడు, డార్విన్. డార్విన్‌కూడ నిశ్చల చిత్తుడు, నిస్స్వార్థపరుడు, నిరహంకారి అయి తేజస్సుతో ప్రకాశిస్తూ వచ్చాడు. కడపటికి దైవము ఒక్కడే అనే సత్యాన్ని గుర్తించాడు. దైవము తన ఎదురుగా వుండినట్టుగా భావించి 'నేను లేక నీవు లేవు', అన్నాడు. దైవములేక భక్తుడు గానీ, భక్తుడు లేక దైవము గానీ వుండుటకు వీలుకాదు. భక్తుడు, భగవంతుడు అవినా భావసంబంధము, అన్యోన్య ఆశ్రయము కలిగిన ఏకత్వస్వరూపులు. భగవంతునియందు భక్తుడు ప్రేమోన్మత్తుడై, తన్మయత్వములో వుండినప్పుడు, తాదాత్మ్యభావన పొందినప్పుడు, భగవంతునితో ఏకత్వమును పొందగలుగుతాడు.

**దానవ వంశమందు జన్మించినప్పటికి మహాపవిత్రమైన జీవితము గడిపినవారు ప్రహ్లాదుడు, విభీషణుడు, బలిచక్రవర్తి**

అట్టివాడే పరమ భక్తుడైన ప్రహ్లాదుడు. అతని వంశము, రాక్షసవంశము; రూపము, మానవస్వరూపము; చిత్తము, దైవ చిత్తము. యీ మూడింటి యేకత్వమును పొందిన పవిత్ర స్వరూపుడే ప్రహ్లాదుడు. ఈ ప్రహ్లాదుడు నిరంతరము భారతీయ సంస్కృతిని ఆశ్రయించుచు 'తు,చ' దానిని అనుసరిస్తూ ఆదర్శముగా ప్రజలకు అందిస్తూ వచ్చాడు. పురుషార్థములు నాలుగు, ధర్మ, అర్థ, కామ, మోక్షములని. ధర్మార్థములు రెండింటిని యేకత్వము గావించి ఆ స్థానమునుండి కామముకూడను నడిపించిన వ్యక్తి, ప్రహ్లాదుడు. అర్థకామములు రెండింటిని ధర్మమయము గావించి తాను ప్రశాంతస్థితి యందుండినప్పుడు మోక్షమే తనను వరించుకుంటూ వచ్చింది. దానవవంశమునందు జన్మించినప్పటికిని ధర్మార్థకామమోక్షములనే చతుర్విధ పురుషార్థములను సార్థకము గావించుకున్నట్టి మహా పవిత్రవ్యక్తులు ముగ్గురు మాత్రమే వుంటుండినారు. వారు బలిచక్రవర్తి, ప్రహ్లాదుడు. విభీషణుడు. మానవులై జన్మించికూడను ధర్మమోక్షములను విస్మరించి అర్థకామములందే జీవితము గడిపి జీవితము వ్యర్థము గావించుకున్న మానవులు అనేకమంది వుంటున్నారు. పరమభక్తుడైన ప్రహ్లాదుని కుమారుడే విరోచనుడు. కానీ విరోచనునియొక్క తత్త్వము

sri sathyasai vachanamrutam

విరుద్ధముగా మారిపోయింది. విరోచనుని భావములు హేతువాదములు. చార్వాకముయొక్క తత్త్వము విరోచనునియొక్క తత్త్వము. ఆ విరోచనునియొక్క కుమారుడే పరమ పవిత్రుడైన బలిచక్రవర్తి. ఈ బలిచక్రవర్తి ప్రహ్లాదునియొక్క మనుమడు. బలిచక్రవర్తి ప్రజలను కన్న బిడ్డలవలే పాలించెడివాడు. ప్రజలయొక్క ప్రేమకు, మన్ననలకు పాత్రుడైనవాడు. ప్రజలనే తన దేహముయొక్క అంగములుగా భావించుకున్నవాడు. ప్రజలు బలిచక్రవర్తిని తమ గుండెవలె విశ్వసించినవారు. ఆ ప్రజలు, తమ చక్రవర్తికి సరియైన సాటిగా వుండేవారు.

**బలి చక్రవర్తి తలపెట్టిన విశ్వజిత్‌యాగము**

ఒకనాడు బలిచక్రవర్తి విశ్వజిత్ యాగమును ప్రారంభించాడు. లోకములో మంచివారిని చూచి, పవిత్రులను చూచి, ఉన్నత స్థానమునందు వున్నవారిని చూచి అసూయతో కుట్రలు పన్ని వారిని చెడుపుటకు అనేక ప్రయత్నములు చేస్తూవుంటారు, కొంతమంది. ఇట్టివి యుగయుగములనుండికూడను, మానవజాతిని వెంటాడుతూ వస్తున్నవే! రామావతారమునందు రాముడు అసూయాపరులచేత హింసింపబడుతూ వచ్చాడు. హరిశ్చంద్రుని సమయమునందుకూడను ఋషులయందు ఒక దుర్భావము బయలుదేరింది. హరిశ్చంద్రుని పరీక్షచేసి అతనిని ఓడించాలని ప్రయత్నించారు, ఋషులు. ధర్మమూర్తులైన పాండవులను చూచి కౌరవులు కండ్లెర్ర చేసుకున్నారు. త్యాగమయుడైన జీససునుచూచి కొంతమంది అసూయాపరులు అతనిపైన కత్తి కట్టారు. సర్వమత సమ్మతమే తనయొక్క అభిమతముగా విశ్వసించిన మహమ్మదును మక్కాకు రానివ్వకుండా పరాభవము గావించి ప్రక్కకు తొలగగొట్టారు. అన్ని కాలములయందు, అన్ని మతములయందు యీ విధమైన అసూయాభావములు చెలరేగి, అశాంతిని అభివృద్ధిపరచి, సమాజములోపల అలజడులు అభివృద్ధి గావించారు.

బలిచక్రవర్తి ప్రజలపైవుండిన అభిమానముచేత, ప్రేమచేత, ప్రజలయొక్క క్షేమమును ఆశించి యావత్ప్రపంచమంతయు తన ఆధీనములో ఉండాలని, విశ్వజిత్ అనగా తాను విశ్వమును జయించినవాడుకావాలని, విశ్వమంతయు సుఖశాంతులతో, భద్రతతో తులతూగాలని సంకల్పించుకున్నాడు. ఈ యాగమును తిలకించిన దేవతలలోకూడ ఒక

srisathyasaivachanamrutam

అసూయా భావము ప్రారంభమైంది. వీరందరు నారాయణుని చేరి “స్వామీ! రాక్షసుడైన బలిచక్రవర్తి విశ్వమునే స్వాధీనము చేసుకొని దేశమునంతయు రాక్షసమయము గావించవచ్చును. కనుక, మమ్ములను రక్షించి అతనియొక్క అభీష్టము నెరవేరకుండా చూచే విధానమును మీరు సంకల్పించాలి” అని ప్రార్థించారు. మానవులు సంకుచిత హృదయులు. తానొకటి తలచిన దైవమొకటి తలచుననే సత్యమును గుర్తించుకొనలేరు. నారాయణుడు వారి అభ్యర్థనన అంగీకరించినట్టే అంగీకరించి బలిచక్రవర్తియొక్క పవిత్ర హృదయాన్ని పరిశీలనచేసి పరమభక్తుడని విశ్వసించి అతనిని యే విధముగానైనా స్వర్గమునకు పంపించాలనే సత్సంకల్పాన్ని తాను చేసుకున్నాడు.

ఈ సంకల్పానుసారము వామనమూర్తిగా సిద్ధాశ్రమమున జన్మించాడు. వామనమూర్తి, ఒక దానమును ఆశించి బలిచక్రవర్తి చేస్తున్న యజ్ఞములో ప్రవేశించాడు. నిర్మలహృదయుడు, నిస్వార్థపరుడు కనుక బలిచక్రవర్తి వామనమూర్తియొక్క తేజస్సును చూచి అతనిని దైవముగా గుర్తించుకోగలిగాడు. “స్వామీ! ఈ యజ్ఞసమయమందు తమయొక్క కోరిక యేమిటి? నేను సర్వసంగపరిత్యాగినై సర్వులకు దాన ధర్మములను గావించి నా జీవితము సార్థకము గావించుకోవాలని సంకల్పించుకున్నాను”, అన్నాడు. వామనమూర్తి చాలా పొట్టివాడు. కాని, పిట్టకొంచెము, కూతఘనము. అతడు కోరిన కోరిక చాలా చిన్నది గానీ అందులోనే అనంతమైన జగత్తు అంతా యిమిడి వుంటున్నది. ‘అబ్బే! బలిచక్రవర్తీ నాకు అధిక దానమక్కరలేదు. మూడడుగులు భూమి మాత్రము యిస్తే చాల’న్నాడు. బలిచక్రవర్తి అందుకు అంగీకరించాడు.

**బ్రహ్మాండమంతయు ప్రబలుచుండెడి తనకు**
**మూడడుగుల నిచ్చుట ముఖ్యమగున**

కానీ, యీ వామనమూర్తి త్రివిక్రమ అవతారము ధరించి, ప్రపంచమునంతయు ఒక్క పాదములో చేర్చుకున్నాడు. ఆకాశమును మరొకపాదముతో ఆక్రమించాడు. చివరకు ‘బలిచక్రవర్తీ! మూడవపాదమునకు స్థలమేమైనా చూపగలవా?’ అన్నాడు. అప్పుడు బలి చక్రవర్తి

srisathyasaivachanamrutam

**ఏ హృదయమును ఒసగితివో యీశ నాకు**
**మగిడి దానినే అర్పింతు మహితమూర్తి**
**పరగ వేరేమి తెత్తు నీ పాదార్చనకు?**

అంటూ 'యిదుగో నా శిరస్సు, దానిపైనే మూడవపాదము పెట్టుకో'మన్నాడు. ఆ విధంగా తన సర్వస్వమును భగవంతునికి అర్పితము గావించుకున్న త్యాగమూర్తి, బలిచక్రవర్తి. ప్రజా సంక్షేమముకొరకు, దేశములో సుఖ, శాంతులకొరకు యజ్ఞము గావించుచున్న బలిచక్రవర్తిని వామనమూర్తి అకస్మాత్తుగా యీ విధముగా పాతాళలోకమునకు త్రొక్కటంచేత ప్రజలు చాలా దుఃఖించిపోయారు.

**బలి చక్రవర్తిపై ప్రజలకుగల అభిమానమునకు గుర్తే 'ఓణం' పండుగ**

పాతాళలోకమునకు పోవుటకు పూర్వము వామనమూర్తిని ఒక కోరిక కోరాడు, బలిచక్రవర్తి. "స్వామీ! నేను నా జీవితమును త్యజించి స్వర్గమును చేరుకోటం నాకు సంతోషమే! కానీ, ప్రజలను నిరాశపెట్టి వారిని దుఃఖింపజేయటము నాకు యిష్టములేదు. కనుక, ప్రతి సంవత్సరము శ్రావణమాసము, శ్రావణ నక్షత్రమందు నా ప్రజలను నేను చూచుకోటానికి వచ్చే అవకాశము అనుగ్రహించ"మని కోరాడు. సంవత్సరమునకు ఒక పర్యాయము తన ప్రజలను చూడాలని యీ విధంగా ప్రజాభిమానముతో తాను యీ కోరికను కోరుకున్నాడు.

కనుక, బలిచక్రవర్తిపైన ప్రజలకుగల అభిమానమునకు గుర్తే యీ ఓణం. ఈ ఓణం పండుగనాడు కేరళ ప్రజలందరు తెల్లవారగనే అభ్యంగనస్నానము లాచరిస్తారు. శ్రావణమునకు చిజ్ఞం అని మళయాళములో ఒక పేరు వుంటుండాది. ఆనాడు కొత్త వస్త్రములు ధరించి అనేక విధములైన మధుర పదార్థములను చేసి దానిని ఒక అరటి ఆకులో వుంచి మొదట బలిచక్రవర్తికి నివేదన చేసి తదుపరి బంధుమిత్రులతో కలసి భుజించి వైభవముగా యీ ఓణము పండుగను జరుపుకుంటారు. కొత్తవస్త్రములను 'ఓణప్పొడి' అని మళయాళములో అంటారు. ఇది ఓణమునకు సరైన అర్థముగా గుర్తిస్తూ వచ్చారు. కొత్త వస్త్రమనగా ఏమిటి? కేవలము దేహమునకు ధరించిన కొత్త వస్త్రమే కాదు.

sri sathyasai vahamrutam

దీనికి అంతరార్థముకూడను వుంది. బలిచక్రవర్తి నూతన దేహమును ధరించాడు. సనాతనమైన దైవత్వము నూతనమైన శరీరము ధరించినట్టుగా యీయొక్క పాతాళలోకమునకు తొక్కబడిన బలిచక్రవర్తి సంవత్సరమునకొక పర్యాయము ప్రజాభిమానమనే దేహమును ధరించటముచేత యిదొక నూతనవస్త్రముగా భావించుకుంటూ వచ్చింది, శాస్త్రము. సాక్షాత్ భగవంతునియొక్క అభిమానమును, ప్రేమను చూరగొన్న దేశమే కేరళదేశము.

**కేరళ రాష్ట్రమునకు పరశురామక్షేత్రమని పేరు వచ్చుటకు వెనుకనున్న గాథ**

ఈ కేరళ దేశమునకు మరొక పేరుకూడను వున్నది, 'పరశురామక్షేత్ర'మని. దీనికి యీ పేరు ఎందుకు వచ్చింది? పరశురాముడుకూడను ఒక అవతారపురుషుడు. అతని తండ్రిని రాజులు శిరచ్ఛేదనము చేయుటచేత ఆ దృశ్యమును చూచిన తల్లి రేణుక 'రామా! రామా' అని కేకలు వేసింది. నిర్మల చిత్తము కలిగిన వ్యక్తికి, నిస్వార్థమైన భావము కలిగినవ్యక్తికి ఎంత దూరములో ఏ ప్రదేశములో తనను పిలచినప్పటికిని పవిత్రమైన, జ్యోతిర్మయమైన తరంగములచేత ఆ పిలుపు సమీపములో పిలచినట్లే ఉంటుంది. ఎక్కడో వుండిన పరశురామునికి తల్లి కంఠము వినిపించింది. మాతృభక్తి కల్గిన పరశురాముడు తల్లి కంఠమును చక్కగా ఏకాగ్రతతో గుర్తు పట్టాడు. ఎన్ని పర్యాయములు పిలిచింది? 'రామా! రామా! రామా!' అని యీ విధముగా యిరువది ఒక్క పర్యాయములు పిలిచింది. ఇంటికి వచ్చి చూచేటప్పటికి ఆశ్రమములో తండ్రిమొండెము, శిరస్సు వేరై వున్నది. ఇది కార్తవీర్యుని కుమారుడు చేసిన క్రూరకర్మ. నా తల్లియొక్క హృదయాన్ని శాంతపరచాలనుకుంటే ఆమె ఎన్ని పర్యాయములు నన్ను పిలిచిందో అన్ని పర్యాయములు యీ క్షత్రియులపైన యుద్ధముచేసి యీవున్నంది క్షత్రియులను నాశనము చేస్తానని ఒక భీకర ప్రతిజ్ఞ చేశాడు, పరశురాముడు. ఆ విధంగా యిరువది ఒక్క పర్యాయములు యుద్ధముచేసి క్షత్రియులనందరిని నాశనము చేశాడు. ఆ ఆవేశమును, ఆవేదనను కొంత చల్లార్చుకొని తండ్రి మృతదేహము దగ్గరకు వచ్చి ప్రార్థించాడు. ప్రార్థించేటప్పటికి, తమ వంశమునకు మూలపురుషుడైన భారద్వాజుడు వచ్చి ఆ తండ్రియొక్క శిరస్సును మొండెమునకు చేర్చి

srisathyasaivachanamrutam

అతనికి ప్రాణమిచ్చాడు. ఇక తాను వచ్చిన కార్యము పూర్తియైనదని తలచుకుని, తదుపరి తాను జయించిన రాజ్యమునంతను తనకు రాజ్యపాలనాకాంక్ష లేకపోవటముచేత కశ్యపుడనే బ్రాహ్మణునకు దానము యిచ్చాడు. తాను స్వయంగా ఇతరులకు దానమిచ్చిన రాజ్యములో తాను వుండటం ధర్మం కాదనుకున్నాడు, యీ పరశురాముడు. సముద్రమును శోధించి అక్కడ ఒక గట్టును యేర్పరచుకొని ఆ గట్టులోపల ఒక గ్రామము నిర్మించుకున్నాడు. అదే పరశురామక్షేత్రమని. ఈ విధంగా దక్షిణ భారతదేశమందు కేరళదేశము పరశురామక్షేత్రమని ప్రఖ్యాతి గాంచింది. అక్కడనే సమీపములోవుండిన మహేంద్ర పర్వతమునకు వెళ్లి తాను తపస్సు చేసుకుంటూ కూర్చున్నాడు. అదికూడను యీ కేరళ రాజ్యమందే వుంటున్నది. ఇలా ఇద్దరు అవతార పురుషుల కార్యక్షేత్రమైన కేరళ దేశము చాలా పవిత్రమైనదేశము.

## కేరళ దైవ సంబంధమైన దేశము

ఈ ఓణం పండుగ సరైన ఋతువులో వస్తుంది. మూడునెలలు కుండపోతగా వర్షములు ప్రారంభమవుతాయి. కేరళలో యీ వర్షముచేత ప్రకృతి అంతయు కొంత స్తంభించిపోతుంది. సూర్యోదయమే అరుదుగా వుంటుంటాది. ఈ వర్షములు నిలచిపోయి సూర్యునియొక్క కిరణములచేత ప్రకృతిని పవిత్రము గావించి యెక్కడ చూచినప్పటికిని పచ్చని పంటలచేతను, నీలమేఘములతోను ప్రకృతి అంతా కళకళలాడుతూ వుంటుంది. ఇది ప్రకృతికూడను ఆనందించే సమయము. ప్రకృతి తన సహజ సౌందర్యమును వహించి ప్రజలకుకూడను సహజానందమునందించే చక్కని అవకాశము యీ ఓణముయొక్క సమయము. పాడిపంటలతో, ధనధాన్యములతో, పండ్లు ఫలములతో దేశము చాలా సౌందర్యముగా వుంటుంది. యీ సమయమునందు ఆ కేరళదేశమును చూచి ఆనందించవలెనుగాని, వర్ణించుటకు వీలుకాదు. ఇది కేవలము దైవముయొక్క సంబంధమైన దేశము, యీ కేరళదేశము.

## మారేది జీవతత్త్వము, మారనిది దైవతత్త్వము

అట్టి పవిత్రమైన దేశమున కాలానుగుణ్యముగా కొన్ని కొన్ని పరిస్థితులు

srisathyasaivachanamrutam

మార్పుచెందుతూ వచ్చాయి. దేశకాలపరిస్థితుల ప్రభావముచేత మానవులయొక్క మనసులుకూడను మారుతూ వచ్చాయి. మనిషికి, మనిషికి మధ్య ద్వేషములు అభివృద్ధి అవుతూ వచ్చాయి. మనసుకు, మనసుకు మధ్య దట్టమైన అజ్ఞానమనే మేఘములు కమ్ముకుంటూ వచ్చాయి. ఈ విధమైన వాతావరణముచేత మనిషియొక్క తత్త్వముకూడను మారుతూ వచ్చింది. అయితే, భౌతికంగా, రాజ్యాంగపరంగా, ప్రజల మానసిక స్థితిగతులపరంగా ఎన్ని మార్పులు వచ్చినప్పటికిని, ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలు, భక్తి ప్రపత్తులు యేమాత్రము మారకుండా ఉన్నాయి. రాజ్యాంగరీతిగా చూచినప్పుడు కేరళ కమ్యూనిష్టు రాజ్యమనుకుంటాము. భగవద్విశ్వాసములేని దేశము అనుకుంటాము. కాదు, కాదు. ప్రజల హృదయములు యీనాటికికూడను పవిత్రమైన భగవద్భక్తితో నిండి వుంటున్నాయి. ఈ ఓణము పండుగనాడు యీ ప్రేమమయమైన పవిత్ర వాతావరణములో ప్రవేశించనివాడు ఒక్క వ్యక్తికూడా కేరళలో వుండనే వుండడు. ప్రతి వ్యక్తికూడను తెల్లవారు ఝామున స్నానము చేసి గంధమును ధరించి యేయే కార్యక్రమములలో పాల్గొనాలో ఆ విధముగా పాల్గొంటారు. దేవాలయములలో కిక్కిరిసి వుంటారు, ప్రజలు. రాజకీయ తంత్రాలవల్ల పైపైన భేదములు కనుపిస్తున్నాయి గానీ అంతరంగములలో యేమాత్రముకూడను భేదములు కనుపించవు. వారి హృదయములందు భక్తి ప్రపత్తులు నిండుగా హత్తుకొని వుంటున్నాయి. జీవుడెవరు? దేవుడెవరు? అనేది ప్రశ్నకు వచ్చినప్పుడు కదిలేది జీవుడు, కదలనది దేవుడు అన్నారు. నిరంతరము మార్పుచెంది చంచలత్వముతో కూడినది జీవతత్త్వము. మారేది జీవుని లక్షణము. మారనిదే దైవతత్త్వము. కనుక, కొన్నివేల సంవత్సరములైనప్పటికిని కేరళలో యీ విధమైన భగవద్భావము మారని యేకత్వముగా వుండే దివ్యత్వము.

### రెండు మంచిల మధ్యలోనే చెడ్డ వుంటున్నాది

ఈ ఓణముయొక్క మహాత్యము యిట్టిది, అట్టిదని చెప్పుటకు వీలుకాదు. పరమభక్తుడు, తాతయైన ప్రహ్లాదునికి, మనుమడైన బలిచక్రవర్తికి, ఇద్దరికి మధ్య హేతువాదియైన తండ్రి విరోచనుడు ఉన్నాడు. రెండు మంచిల మధ్య ఒక చెడ్డ చేరి వుంది. ప్రహ్లాదుడు

sri sathyasai vachanamrutam

పరమభక్తుడు. బలిచక్రవర్తికూడా మహాభక్తుడు. మధ్యలో కొంచెము భక్తిహీనమైనవాడే విరోచనుడు. లోకములో ప్రహ్లాదునివంటి భక్తుల సంతతి పెరుగుతూ వస్తున్నాది. మధ్య మధ్య భగవద్విశ్వాసము లేని విరోచనుని వంటివారి సంతతికూడా పెరుగుతూ వస్తున్నాది. ఈ విధమైన మార్పులు లేకపోతే యీ జగత్తే లేదు. పుట్టుటకు పూర్వము యీ జగత్తు లేదు. మరణించిన తరువాత యీ జగత్తు లేదు. జననమరణములకు మధ్య మాత్రమే యీ జగత్తు చేరి వుంటున్నాది. కనుక, రెండు మంచిలమధ్యలోనే యీ చెడ్డ వుంటున్నాది.

**చిత్తశుద్ధితో ఉన్నప్పుడే దైవత్వము ప్రాప్తిస్తుంది**

ఎవరికెవరు సంబంధము లేదు. దేహరీతిగా తండ్రులు, తాతలు, ముత్తాతలు, మనుమలు అని పిలుచుకోవచ్చు. ఇవి దేహసంబంధములు మాత్రమే!

**దేహము పాంచ భౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్**
**మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు జూడ నా**
**దేహియె దేవదేవుడు మదిన్ తలపోయగ నాత్మరూపుడౌ**

ఈ దేహము యేమిటి?

**మలినపుకొంప రోగముల ప్రగ్గెడు సేవక గంప జాత సం**
**చలనము పొందు దుంప భవసాగరమీదగలేని కంప అం**
**బుల పొదిలెమ్ము చూడ మనమెచ్చు దలంపగ దేహమింక ని**
**శ్చలమని నమ్మబోకు మనసా హరిపాదము లాశ్రయింపవే**

దేహము నీటి బుడగ. మనస్సు పిచ్చికోతి. ఈ కోతిని నీవు అనుసరించవద్దు. చిత్తమును అనుసరించు. నీ చిత్తమును శుద్ధి చేసుకో. అప్పుడే దైవత్వము నీకు ప్రాప్తిస్తుంది. కనుకనే తిరుత్తోండాళ్వారు "చిత్తశుద్ధితో నేను నీ పూజ చేస్తున్నాను. రామా! నీవు లభించాలి నాకు. నిన్ను నేను ప్రేమించాను. నన్ను నీలో చేర్చుకో"మన్నాడు. పరమభక్తులైన వారు ఈ విధంగా తమయొక్క ఆదర్శమును జగత్తుకు అందింపజేసి అనేక కష్టములకు నష్టములకు, దుః

sri sathyasai vahanamrutam

ఖములకు, నిందలకు నిష్ఠూరములకు గురవుతారు. ఈ ప్రపంచములో మానవులు వచ్చే సమయములో యేమీ తేరు. ఇంత బట్టైనా కట్టుకొనిరారు. పోయే సమయములో ఎడ్రసు యిచ్చిపోరు. ఇలాంటి వారు మన బంధువులు ఎట్లా అవుతారు? ఎవరి జన్మము వారిదే! ఎవరి కర్తవ్యము వారిదే! కనుక, తమ తమ కర్తవ్యాన్ని నిర్వర్తించుకొని జీవితమును సార్థకము గావించుకొనే మానవత్వాన్ని మనం అభివృద్ధి పరచుకోవాలి.

**బలి చక్రవర్తి మోక్షమును పొందిన పవిత్రదినమే ఓణం**

ఇట్టి ఏకత్వమును, సత్యాన్ని, దివ్యత్వాన్ని ప్రబోధించి, ప్రజలను ఆనందింపజేసి, వారిని పరిపాలించినవాడు బలిచక్రవర్తి. ఆ బలి చక్రవర్తి మోక్షమును పొందిన పవిత్రమైన దినమే యీ ఓణము దినము. వామనుడు పుట్టిన దినమే యీ ఓణము దినము. ప్రతి సంవత్సరముకూడను వామనుడు నూతన అవతారములతో ప్రజాక్షేమమును, ప్రజాభిమానమును కాక్షించి ప్రజల భక్తి ప్రపత్తులను అందుకునే దినమే యీ ఓణం దినము. కనుక యీనాడు కేవలము ఆహారవిహారాదులచేత మాత్రమే తృప్తిచెందక ఆత్మానందముతో తృప్తి పొందే విధానమును గుర్తించాలి. ప్రహ్లాదుని తండ్రియైన హిరణ్యకశిపుడు ప్రహ్లాదునికి హరి చింతన చేయవద్దని అనేక విధములుగా బోధించటానికి ప్రయత్నించాడు. బిడ్డను ఆదరించి అక్కున చేర్చి ఆనందింప చేసేది తల్లి. తనయొక్క హరినామ చింతనను కొనసాగించడానికి తల్లియేమైనా తోడ్పడుతుందో యేమోనని ఒకానొక దినము తండ్రి పెట్టే హింసలను భరించుకొనలేక తల్లి దగ్గరకు వెడతాడు, ప్రహ్లాదుడు. కుమారుని తండ్రి పెడుతున్న బాధలను గురించి వినటంచేత చాలా బాధపడింది, తల్లి లీలావతి. తన వద్దకు పరుగెత్తుకు వచ్చిన ప్రహ్లాదుని కౌగలించి అక్కున చేర్చుకొని చెప్పుతున్నది, లీలావతి:

> **ఏల యిటుల తనయా వలదు హరిహరి అనబోకుమురా**
> **ఏటి హరియో యిటు నువ్వు పలుక ఎవరు నేర్పిరిరా**

ఈ మాటలు వినేటప్పటికి ప్రహ్లాదుడు 'ఓహో! తండ్రి వ్యాధి తల్లికికూడను ప్రాకినదే!' అని గుర్తించుకున్నాడు. " హరి నామస్మరణ ఒకరు నేర్పితే వచ్చేదా? ఒకరి వల్ల



sri sathyasai vachanamrutam

నేర్చుకునేదికాదు. నా అంతర్వాణి నాకు బోధిస్తున్నది. అంతర్వాణియే నాచేత అనిపిస్తుండాది. నా అంతర్వాణి ఆ నారాయణుడే!" అనే సత్యాన్ని తల్లి దగ్గర స్పష్టముగా చెప్పాడు: "తల్లీ! హరినామము బయటనుండి కూరేదికాదు. లోపలనుండి వూరేది", అన్నాడు. పెదిమలద్వారా ఉచ్చరించిన హరినామము, హరినామముకాదు. హృదయమునుండి ఆవిర్భవించినదే హరినామము. జాగ్రత్ స్వప్న సుషుప్తులయందుకూడను ప్రహ్లాదుడు హరిని స్మరించేవాడు. అతనియొక్క రక్తమంతయుకూడను నారాయణుని నామముతో నిండి వుంటున్నాది. అట్టి ప్రహ్లాదునకు ఒకరు నేర్పేవారా! మంచి కఠినమైన రాక్షసులను నియమించాడు ప్రహ్లాదుని శిక్షింపచేసేకోసమని, హిరణ్యకశిపుడు. చండ, అమార్కుడు, వీరిద్దరిని గురువులుగా నియమించాడు. వీరిని చేరే సరికే భయమవుతుంది పిల్లలకు. వారు ఎన్ని బాధలు పెటినప్పటికిని, ఏ విధమైన హింసలకు గురిచేసినప్పటికిని తాను ఆ నామమును వదలలేదు. ఈనాటి మానవులు తాము సంకల్పించుకున్నదేదైనా నెరవేరకపోతే తక్షణమే తమ ఇష్ట దేవతాస్వరూపమును మార్చివేస్తారు. అభీష్టములు నెరవేరకపోతే ఫొటోలు తీసి ప్రక్కన పెట్టేస్తారు. ఇది తుచ్ఛమైన బుద్ధులయొక్క తత్త్వము. ఇదే నిజమైన రాక్షసత్వము. కానీ, రాక్షస వంశములో జన్మించిన ప్రహ్లాదుడు నారాయణుని పవిత్రమైన దైవముగా తాను విశ్వసిస్తూ వచ్చాడు. మానవత్వము, దానవత్వము, దైవత్వము ప్రవర్తనలో వ్యక్తమవుతాయేగాని స్వరూపములో కాదు. ప్రహ్లాదుని బాధలు పెట్టే చండ, అమార్కులకుకూడను విసుగు పుట్టిపోయింది, పాపం! వారు ఏమి చేసినా ప్రహ్లాదుని మనసు మార్చలేకపోయారు. 'దేవుడంటే ఎవరు? హిరణ్యకశిపుడే! హిరణ్యకశిపుడే దేవుడ'ని చెప్పమని నిర్బంధించారు, యీ చండామార్కులు. అయితే ఎన్ని బాధలు పెట్టినప్పటికిని 'కాదుకాదు, నా దేవుడు నారాయణుడే!' అని స్పష్టముగా చెప్పాడు, ప్రహ్లాదుడు. ఈ విధముగా చెప్పేటప్పటికి హిరణ్యకశిపుని దగ్గరకు పరుగెత్తి వచ్చి

**తన్ను నిశాచరులు పొడువ దైత్యకుమారుడు మాటిమాటికో**
**పన్నగశాయి! యో దనుజ భంజన! యో జగదీశ! యో మహా**
**పన్న శరణ్యా! యో నిఖిలపావన! యంచు నుతించెగాని తా**

sri sathyasaivacharamrutam

**కన్నుల నీరు తేడు భయకంపసమేతుడు కాడు భూవరా!**

అని విన్నవించుకున్నారు, రాక్షస రాజైన హిరణ్యకశిపునితో. ఇట్టి స్థితప్రజ్ఞతత్త్వాన్ని ప్రకటించినవాడు ప్రహ్లాదుడు.

అతని పేరునందే వుంటున్నది యీ యొక్క తత్త్వము. 'ప్ర', 'హ్లా', 'ద' అనగా ఆహ్లాదముతో నిండినవాడు అని భావము. అనగా ఆనందమయుడే ప్రహ్లాదుడు. నిత్యానందం, బ్రహ్మానందం, యోగానందం, పరమానందం, అద్వైతానందం, సచ్చిదానందం యీ విధమైన ఆనందములలోపల సర్వమయ ఆనంద స్వరూపుడే యీ ప్రహ్లాదుడు. ఇట్టి ఆనందమును ప్రజలకు అందించి, తాను అనుభవించి, కేరళరాజ్యమునకు చక్కని కీర్తిని తెప్పించిన చక్రవర్తులు యీ ప్రహ్లాద, బలి చక్రవర్తులు. సాక్షాత్ భగవంతుడే నిర్మించిన ప్రదేశమునందు తాము నివసించి పట్టణములు కట్టుకొని జీవితాన్ని గడిపే కేరళ రాజ్య ప్రజలు యెంతో అదృష్టవంతులు. ఇది పరశురాముడు నిర్మించిన క్షేత్రము, బలిచక్రవర్తి యేలిన క్షేత్రము, ప్రహ్లాదుడు పుట్టిన క్షేత్రము, బలిచక్రవర్తి మోక్షమునకు ప్రయాణమైన క్షేత్రము, వామనమూర్తి అవతరించిన క్షేత్రము. ఇన్ని పవిత్రములతోకూడిన క్షేత్రము కనుకనే ప్రజలయొక్క హృదయముకూడను పవిత్రముగా, దివ్యముగా, భవ్యముగా ఉండి వారు సుఖశాంతులతో ఆనందించాలని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(1986 సెప్టెంబరు 15వతేదీ ఓనం సందర్భముగా పూర్ణచంద్రలో భగవాన్‌బాబావారి దివ్యోపన్యాసం)**

sri sathyasai vachanamrutam